www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 3 డిసెంబర్ 2024

5

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ



## అవయవదానానికి అంగీకార పత్రం

ప్రజాశక్తి-రామచంద్రపురం

ద్రాక్షారామకు చెందిన సామాజిక కార్యకర్త, రక్తదాన, నేత్రదాన మోటివేటర్ కంచర్ల చక్రధర్ రావు అవయవ దానానికి సోమవారం అంగీకార పత్రం అందజేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్లడ్ డోనర్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు తొగరుమూర్తి ఆధ్వర్యంలో తన 50వ పుట్టినరోజు పురస్కరించుకుని ఆయన అవయవ దానానికి అంగీకార పత్రం అందజేశారు. కాకినాడ డాక్టర్ బాదం బాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డాక్టర్ డివి.రాజు మల్టీ ఆర్గాన్ ఫౌండేషన్ ద్వారా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తొగరుమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా తొగరుమూర్తి మాట్లాడుతూ అవయవదానంతో మరణించిన తర్వాత ఎనిమిది మందికి పునర్జన్మ ఇవ్వచ్చునని తెలిపారు.మనిషి చనిపోయాక కూడా తన కళ్ళు లోకాన్ని చూడాలంటే నేత్రదానం ద్వారానే జరుగుతుందని తెలిపారు.

# గంగ పుత్రులకు ఏదీ భరోసా..!

- 11,305 మంది మత్స్యకారుల ఎదురుచూపు
- జిల్లాలో భరోసాకు రూ.22.61 కోట్లు అవసరం
- ఖాతాల్లోకి జమ చేయని ప్రభుత్వం

ప్రజాశక్తి - రాజోలు

నిత్యం కడలితో సహవాసం చేస్తూ.. నడి సంద్రాన అలల వల విసురుతూ బతుకుపోరు సాగించే మత్స్యకారులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఇచ్చే మత్స్యకార భరోసా నగదు ఈ ఏడాది ఇంత వరకు వారికి అందలేదు. గత ప్రభుత్వానికన్నా రెట్టింపు నగదు ఇస్తామని హామీలు గుప్పించి గద్దెనెక్కిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చి ఐదు నెలలైనా దానిపై ఎటువంటి ప్రకటనా చేయలేదు. దీంతో జిల్లాలో వేలాది మంది మత్స్యకారులు నూతన ప్రభుత్వం పెంచిన భరోసా కోసం కోటి ఆశలు గంపెడాశతో కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు.

**వేట నిషేధంలో ఇవ్వాల్సిన భరోసా..!**

చేపల వేట నిషేధ సమయంలో ప్రభుత్వం అందించాల్సిన పరిహారం కోసం మత్స్యకారులకు ఎదురు చూపులు తప్పడం లేదు. సముద్రంలో వివిధ రకాల చేపలు, రొయ్యలు సంతానోత్పత్తి కాలంగా భావించి ఏప్రిల్ 14 అర్ధరాత్రి నుండి జూన్ 14 అర్ధరాత్రి వరకు సుమారు 61 రోజుల పాటు సముద్రంలో చేపల వేటపై ప్రభుత్వం నిషేధం విధించిన విషయం తెలిసిందే. చేపల వేట విరామ కాలంలో మత్స్యకారులను ఆర్థికంగా ఆదుకొనేందుకు ప్రభుత్వం ప్రతి ఏడాది మే నెల రెండో వారంలో మత్స్యకార భరోసా పథకం పేరుతో అర్హత గల ప్రతి మత్స్యకారుడికి రూ.10 వేల వంతున వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేసేది. అయితే ఈ ఏడాది 2024-25 ఇప్పటి వరకు పరిహారం అందకపోవడంతో మత్స్యకారులు ఇబ్బందులు పడు తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం మారడం భరోసా రూ.20 వేల హామీ ఇవ్వడంతో ఈ ఏడాది భరోసా రూ.10 వేలు ఇస్తారా? లేక హామీ ప్రకారం రూ.20 వేలు ఇస్తా అనే చర్చ మత్స్యకారుల్లో ఉంది. వేట నిషేధ కాలానికి ఆర్థిక భరోసాగా వైఎస్ఆర్ ప్రభుత్వం రూ.10 వేలు ఇవ్వగా, ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం రూ.20 వేలు ఇస్తానని ఎన్నికల్లో వాగ్దానం చేసింది. దీంతో మత్స్యకార భరోసా ఎప్పుడు ఇస్తారోనని 5 నెలలుగా మత్స్యకారులు కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారు.



**11,305 మంది లబ్ధిదారులు ఎదురు చూపు..!**

అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 93 కిలోమీటర్ల తీరం ఉంది. ముమ్మిడివరం, పి.గన్నవరం, రామచంద్రపురం, కొత్తపేట, అమలాపురం, రాజోలు నియోజకవర్గాల్లో ఈ ఏడాది వేట నిషేధ భృతి కోసం 11,305 మందిని గుర్తించారు. సుమారు 1,931 బోట్లను వీరు వినియోగిస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో మత్స్యకార భరోసా భృతి కింద ప్రతి కుటుంబానికీ రూ.10 వేల వంతున అందించాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఏడాది మే నెల 13న పోలింగ్ పూర్తయిన వెంటనే మత్స్యకారుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని అధికారులు చెప్పారు. అయితే ఇప్పటి వరకు జమ కాలేదు. జూన్ 4న ఓట్ల లెక్కింపు అయి ప్రభుత్వం మారింది. నూతన ప్రభుత్వం మారి ఐదు నెలలు గడిచినా ప్రభుత్వం కావాలనే జాప్యం చేస్తోందని మత్స్యకారులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం మత్స్య కారుల భరోసా రూ.10 వేల నుండి మరో రూ.పది వేలు పెంచి రూ.20 వేలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం హామీపై గంగ పుత్రులు గంపెడాశతో ఎదురుచుస్తున్నారు. చేపల వేట సరిగా లేక ఇబ్బంది పడుతున్న మత్స్యకారులు సక్రమంగా సాగని చేపల వేటప్రకతి వైపరీత్యాలు, సోనాబోట్ల తాకిడితో కొద్ది నెలలుగా చేపల వేట ఆశాజనకంగా లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఐదున్నర నెలల కాలంలో కేవలం నెలరోజులు మాత్రమే చేపల వేట సక్రమంగా సాగిందని మత్స్యకారులు చెబుతున్నారు. సుమారు 2 నెలల పాటు ప్రకతి వైపరీత్యాలతో చేపల వేటకు వెళ్లొద్దని ఆంక్షలు విధించగా, మిగిలిన రోజులు వేటకు వెళితే డీజిల్ ఖర్చులు కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



**త్వరలోనే నగదు జమ అవుతుంది**

జిల్లాలో 11,305 మంది లబ్ధిదారుల జాబితా సిద్ధం చేశాం. ఉన్నతాధికారులు ప్రభుత్వం విడిపై నిర్ణయం తీసుకున్న త్వరలోనే ప్రతి లబ్ధిదారునికి రూ.20 వేల చొప్పున జమ చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోగానే మత్స్యకారుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ అవుతాయి.

- ఎన్.శ్రీనివాస్, జిల్లా మత్స్యశాఖ జెడి



**నెలలు గడుస్తున్నా భరోసా ఏదీ..!**

గతేడాది వరకు మత్స్యకార భరోసా రూ.10 వేలు మత్స్యకారులకు సకాలంలో అందింది. ఈ ఎన్నికల్లో చంద్రబాబు వేట నిషేధ భత్యం రూ.20 వేలు ఇస్తామని ప్రకటించారు. కానీ వేట నిషేధకాలం ముగిసి నెలలు గడుస్తున్నా మత్స్యకార భరోసాకు సంబంధించి ఒక్క ప్రకటనా రాలేదు. ఇస్తారో లేదో తెలియదు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. మత్స్యకారులకు భరోసా నగదు త్వరగా ఇవ్వాలని కోరుకుంటున్నా.

- వైదాని అప్పన్న, మత్స్యకారుడు, కాట్రేనికోన.



**మత్స్యకారులను ఆదుకోవాలి**

ప్రతి సంవత్సరం వేట నిషేధ కాలం పూర్తి కాగానే మత్స్యకార భరోసా ప్రభుత్వం ఇచ్చేది. కాని ఈసారి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నెలలు గడుస్తున్నా మత్స్యకార భరోసా ఇవ్వలేదు. చేపల వేట కూడా ఆశాజనకంగా లేదు. భరోసా మొత్తం ఇచ్చి మత్స్యకారులను ఆదుకోవాలి. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రూ.20 వేల మత్స్య కార భరోసా ఇచ్చి ఆదుకోవాలి.

- మేడా లక్ష్మణ్ ,మత్స్యకారుడు, కాట్రేనికోన.

## అర్జీలను అత్యంత నాణ్యతతో పరిష్కరించాలి

ప్రజాశక్తి-అమలాపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలను అత్యంత నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ మదన్‌మోహనరావు, డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ శివశంకర ప్రసాద్, డ్వామా పీడీ మధుసూదన్, ఐసిడిఎస్ పీడీ ఝాన్సీ రాణితో కలిసి ప్రజల నుంచి 130 అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని, అధికారులు గ్రీవెన్స్ అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి తప్పకుండా వ్యక్తిగతంగా అర్జీలను ఓపెన్ చేసి చూడాలన్నారు. ప్రతి శాఖకూ సంబంధించి జిల్లా డివిజన్ మండల స్థాయిలో గ్రీవెన్స్ నోడల్ అధికారులను నియమించే దిశగా మంగళవారం లోపు ఉత్తర్వులు జారీ చేసి జిల్లా యంత్రాంగానికి వివరాలు సమర్పించాలన్నారు. గ్రీవెన్స్‌ను పరిష్కరించే క్రమంలో సంబంధిత సమస్యను రూల్స్ ప్రకారం పరిష్కరించగలమా లేదా అన్న విషయాన్ని కచ్చితంగా రాతపూర్వకంగా తెలపాలన్నారు. అధికారులు అర్జీలను పరిష్కరించేటప్పుడు తప్పుగా టాగింగ్, డిస్పోజల్, ఎండార్స్‌మెంట్ చేస్తున్నారని.. తప్పిదాలను సరిదిద్దుకోకపోతే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతిరోజూ పిజిఆర్ఎస్ అర్జీలపై అధికారులు 20 నిమిషాలు సమయం వెచ్చించాలన్నారు. అత్యధికంగా పురపాలక, పంచాయత్, సర్వే, సెర్ప్, రెవెన్యూ, పోలీస్, పౌరసరఫరాలు, ఆరోగ్య శాఖలకు సంబంధించి అర్జీలు అందుతున్నాయని, వీటిపై ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. రాష్ట్రస్థాయిలో ఆడిట్ టీములు అర్జీదారులకు ఫోన్ చేసి అర్జీల పరిష్కారంపై సంతృప్తి చెందారా లేదన్న విషయాన్ని అడిగి తెలుసుకుంటున్నారని తెలిపారు. ప్రజా ప్రతినిధులకు కూడా ప్రజల గ్రీవెన్స్ రిజిస్టర్ చేయడానికి లాగిన్స్ ఇచ్చినట్టు తెలిపారు. డిఇఒ ఎస్‌కె.సలీం బాషా, డిపిఒ శాంతలక్ష్మి, డిఎంహెచ్ఒ దుర్గారావుదొర, రామకృష్ణారెడ్డి, కృష్ణారెడ్డి, బి.రాము, కార్తీక్, వెంకటేశ్వర్లు, ప్రసాద్, పాల్గొన్నారు.



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

## సంఘం శరణం గచ్ఛామి పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురంలో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో డిసెంబర్ 8న ప్రదర్శించే 'సంఘం శరణం గచ్ఛామి' సాంఘిక నాటక కరపత్రం, పోస్టర్‌ను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ సాంఘిక నాటకం రామచంద్రపురం జూనియర్ కళాశాల ప్రాంగణంలో డిసెంబర్ 8న సాయంత్రం గంటలు 6 నుండి రాత్రి 9 వరకు ప్రదర్శిస్తారని తెలిపారు. మానవతావాది డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవిత చరిత్ర అందరూ తెలుసుకోవాలన్నారు. ఈ నాటకాన్ని అన్ని వర్గాల ప్రజలు, యువకులు ప్రతి ఒక్కరూ హాజరై వీక్షించి, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సుభాష్ కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్‌ఛార్జి పి.చంద్రశేఖర్, దళిత ఐక్య వేదిక నాయకులు, గాలింకి చిట్టిబాబు, డి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సుభాష్

## నిందితుని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

నవంబర్ 19న మలికిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన దాడి ఘటనలో ప్రధాన నిందితుని అరెస్టు చేయాలని రజక సంఘం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్, ఎస్‌పి కృష్ణారావుకు బాధితులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడు శంకర్ మాట్లాడుతూ గత నెలలో జరిగిన ఘటనకు సంబంధించి మలికిపురం పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయిందని ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేయగా ప్రధాన నిందితుని ఇంతవరకు అరెస్టు చేయలేదని తెలిపారు. వారి వల్ల తనకు, కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని, వెంటనే నిందితుని అరెస్టు చేసి తమకు రక్షణ కల్పించాలని కోరారు.

## పౌష్టికాహార కిట్ల పంపిణీ

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండలంలోని వల్లూరులో హెచ్ఐవి బాధితులకు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్క్ ఆధ్వర్యంలో సోమవారం పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు. అచ్యుతాపురం పిహెచ్‌సి పరిధిలోని వల్లూరు ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం వద్ద ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో లింక్ జోనల్ సూపర్‌వైజర్ జి.శ్రీనివాస్, అచ్యుతాపురం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ అలేఖ్య మాట్లాడారు. అనంతరం హెచ్ఐవి బాధితులకు పౌష్టికాహార కిట్లు అందజేశారు. కార్యక్రమంలో లింక్ వర్కర్ సుజాత, ఎంపిహెచ్ఇఒ గోపాలకృష్ణ, హెల్త్ సూపర్వైజర్ ఎం.శ్రీధర్, ఎఎన్ఎం వై.స్వర్ణలత పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ అప్పారావు, ఉపాధ్యాయులు

## జాతీయ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-ఐ.పోలవరం

జి.వేమవరంలోని జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు క్రీడల్లో జాతీయస్థాయి ఆటల పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల కాకినాడ క్రీడా ప్రాధికార సంస్థ ప్రాంగణంలో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ 17 బాలికల సాఫ్ట్ బాల్ పోటీలలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్టు ద్వితీయ స్థానం సాధించింది. ఈ జట్టులో పాఠశాలకు చెందిన ఆరుగురు క్రీడాకారులు పాల్గొనగా లంకలపల్లి చిన్న తల్లి, బొమ్మిడి పూర్ణిమ వెంకట దుర్గా జాతీయ జట్టుకు ఎంపికయ్యారని హెచ్ఎం సలాది వెంకట నారాయణ తెలిపారు. ఎంపికైన ఇద్దరూ జనవరి 5 నుంచి 10వ తారీకు వరకు మహారాష్ట్రలోని జలగావ్‌లో జరిగే పోటీల్లో మన రాష్ట్రం తరపున పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను, కోచ్ అడ్డగళ్ల నాగరామ్‌ప్రసాద్, జి.కళావతిని పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ బసవ అప్పారావు, పాఠశాల స్టాఫ్ సెక్రటరీ ఎస్.శ్రీమన్నారాయణ అభినందించారు.



నిత్యావసర సరుకులు అందిస్తున్న సంఘం సభ్యులు

## అగ్నిప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి-అయినవిల్లి


ఎపి షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చింతనలంకలో అగ్ని ప్రమాద బాధితులకు సోమవారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బీర సందీప్, గోసంగి బంగార్రాజు, నేరెడిమిల్లి సత్యనారాయణ, గుమ్మడి వెంకట్, డి.సత్యనారాయణ, రాయి వెంకటేశ్వరరావు, మల్లవరపు చంద్రరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ మాసాబత్తుల సురేష్, పరమట నాని, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

## నేడు మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని 6 పురపాలక సంఘ కమిషనర్లతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్టు రీజనల్ డైరెక్టర్ అప్పిలెట్ కమిషనర్ సిహెచ్.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశం ఉదయం 10 గంటలకు రామచంద్రాపురం పురపాలక సంఘ కౌన్సిల్ హాల్లో నిర్వహిస్తామని, మున్సిపల్ అధికారులు, కార్యాలయ సిబ్బంది సమావేశంలో పాల్గొనాలని ఆయన తెలిపారు.

### కార్టూ'నిజం'




# తడిసిన ధాన్యం ఒబ్బిడికి రైతుల శ్రమ

**తుపాను వల్ల కురిసిన వర్షాలకు పాడైన పంటలను రైతులు ఒబ్బిడి చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు పంటలను పరిశీలించి సూచనలు పలు సూచనలు చేశారు.**

ప్రజాశక్తి-యంత్రాంగం

అమలాపురం తుపాను కారణంగా వర్షాలతో వరి రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పండించిన పంట కళ్లాలలో, రోడ్ల పక్కన ఉన్న ధాన్యం రాశులను రక్షించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొచ్చే సమయంలో అన్నదాతను తుపాను కోలుకోలేని దెబ్బతీసింది. మాసూళ్లు చేసిన ధాన్యం ఆరబెట్టుకునే పరిస్థితి లేకుండా పోయింది. వర్షానికి తడిసిన ధాన్యం రంగు మారినా మొలకెత్తినా దళారులు, మిల్లర్లు కుమ్మక్కై, తేమ పేరిట ధాన్యం విక్రయాల్లో రైతుకు విపరీతమైన నష్టం కలుగుతుంది. జిల్లాలో అంబాజీపేట, ముమ్మిడివరం, అమలాపురం, రాజోలు, పి.గన్నవరం, అయినవిల్లి తదితర మండలాల్లో వరిపై వర్షాల ప్రభావం అధికంగా ఉంది. జిల్లాలో ఈ ఖరీఫ్‌లో సుమారు 1.60 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. ఇప్పటి వరకూ సుమారు 90 వేల ఎకరాల్లో వరి పంట మాసూళ్లు పూర్తి చేశారు. దాదాపు 58 వేల ఎకరాల్లోని పంట కళ్లాలు, రోడ్లపై ఉంది. మిగిలిన ఎకరాల్లో పంట కోత దశకు చేరుకుంది. ఈ ఖరీఫ్ లో 2.37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అధికారులు అంచనా వేశారు. జిల్లాలోని 307 రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. రైతులకు నష్టం వాటిల్లకుండా 24 శాతం వరకూ తేమ ఉన్నా ధాన్యం కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నా, క్షేత్ర స్థాయిలో ఎక్కడా అమలు కావడం లేదు.

**ఉప్పలగుప్తం** తుపాను కారణంగా దెబ్బతిన్న వరిచేలను సోమవారం జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం.నందకిషోర్ పరిశీలించారు. చిన్నగాడవిల్లిలో వరి చేలని పరిశీలించిన ఆయన వరి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు సూచించారు. మండలంలోని 10 గ్రామాల్లో 383 ఎకరాల్లో వరి పంట నీట మునిగిందని అంచనా వేశారు. మండలంలో 44 81 ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేయగా ఇప్పటివరకు 1961 ఎకరాల్లో మాత్రమే వరి కోతలు పూర్తయినాయని ఇంకా 2,394 ఎకరాల్లో వరి కోతలు పూర్తవలసి ఉందని మండల వ్యవసాయ అధికారి జి.కుమార్ బాబు తెలిపారు.

**ముమ్మిడివరం** రైతులు తుపాను కారణంగా కురిసిన వర్షాలకు నీట మునిగిన పంట పొలాలను కాపాడుకునేందుకు వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు పాటించి పంటలను కాపాడుకోవాలని ప్రధాన వ్యవసాయం శాస్త్రవేత్త నందకిషోర్ సూచించారు. పలు ప్రాంతాల్లో వర్షాలకు తడిసి నీట మునిగిన పంట పొలాలను, ధాన్యం రాశులను సోమవారం శాస్త్రవేత్తల బందం పరిశీలించింది. ఈ సందర్భంగా శాస్త్రవేత్త నంద కిషోర్ రైతులకు పలు సలహాలు సూచనలు చేశారు. కోత కోసి పనలపై ఉన్న వాటిని కుప్పలుగా వేసే టప్పుడు ఎకరాకు 20 కిలోల ఉప్పు పనలపై పిచికారీ చేయాలని, కోత కోసి ఉన్న పనలు గింజలు మొలకెత్త కుండా 5 శాతం ఉప్పు ద్రావకం పనలపై పిచికారీ చేయాలని, పొలంలో నీరు నిలిచినట్లైతే గట్ల పైకి తెచ్చి విడిగా పేర్చి ద్రావకం చల్లాలని, ఎండకు తిరగేసి ఎండబెట్టు కోవాలని సూచించారు.



అమలాపురంలో తడిసిన ధాన్యాన్ని ఎండబెట్టే ప్రయత్నం చేస్తున్న రైతులు



ఉప్పలగుప్తంలో వరి చేలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు



ఉప్పలగుప్తంలో వరి చేలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

## ఎంఎల్ఎ వేగుళ్లకు పలువురి అభినందన

ప్రజాశక్తి-మండపేట, కపిలేశ్వరపురం

ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది ఆయనకు సోమవారం అభినందనలు తెలిపారు. టిడిపి కార్యాలయంలో వేగుళ్లను వారు మర్యాద పూర్వకంగా కలిశారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీ ఫెడరేషన్ చైర్మన్ డాక్టర్ ఈదల శ్రీనివాస్ చౌదరి ఆధ్వర్యంలో వేగుళ్లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ కార్యవర్గ సభ్యులు ఇ.సాంబమూర్తి, యూనియన్ నాయకులు కె.శ్రీనివాసు, కె.విజయ్ బాబు, ఎస్‌కె.షెహన్‌షా, ఆర్.పట్టాభి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ళ జోగేశ్వరరావును కపిలేశ్వరపురం మండలం కాలేరు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు సోమవారం మండపేట పార్టీ కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు. ఎంఎల్ఎ వేగుళ్లకు సాలువాకప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముత్యాల వీరవెంకట సత్యనారాయణ, వల్లూరి కాశీవిశ్వనాథం, గుణ్ణం సత్యనారాయణ, మెర్ల తాతాజీ, టిడిపి నాయకులు మత్తాల మధుసుధానరావు, ఎంపిటిసి టేకి మంజు, నాతి చంద్రశేఖర్, జనసేన నాయకులు పెయ్యల యాకోబు, విద్యాకమిటీ చైర్మన్ పలివెల రమేష్, కొల్లి జాన్, గెద్దాడ నగేష్ పాల్గొన్నారు.



కపిలేశ్వరపురంలో ఎంఎల్ఎను సత్కరిస్తున్న నాయకులు



మండపేటలో ఎంఎల్ఎను సత్కరిస్తున్న ఉద్యోగులు

## 7న విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం

ప్రజాశక్తి-కె.గంగవరం

ఈ నెల 7న కె.గంగవరంలో నిర్వహించే విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాన్ని విజయవంతం చేయాలని సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ ఎం.సత్యనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రమైన కె.గంగవరం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులు వివరించాలని, దాతల సాయంతో శుభదినం భోజనాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మెగా సమావేశం గురించి విస్తతంగా ప్రచారం చేయాలని ఆయన తెలిపారు. ఎక్కువమంది తల్లిదండ్రులు పాల్గొనేలా అందరికీ ఆహ్వాన పత్రాలు పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ చోడిశెట్టి ఆంజనేయులు, ఇన్‌ఛార్జి పివి.బ్రహ్మానందం, సిఆర్‌పి గంధం వెంకన్న బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎస్ఎ కో ఆర్డినేటర్

## ఒఎన్‌జిసి పైప్‌లైన్ లీకేజీ, నిలిపివేత

ప్రజాశక్తి -మామిడికుదురు

గెద్దాడలో (తాటిపాక 6) బావి పైప్ లైన్ నుంచి సోమవారం స్వల్పంగా గ్యాస్ లీకేజీ చోటు చేసుకుంది. ఒఎన్‌జిసి అధికారులు సంఘటనా సలానికి చేరుకుని తాటిపాక 6 బావి నుంచి గ్యాస్ సరపరా నిలిపివేశారు. లీకైన చోట 10 మీటర్ల పాత పైపులైను తొలగించి దాని స్థానంలో కొత్త పైపులైను ఏర్పాటు చేశారు. ఈ బావి నుంచి నగరం జిజిఎస్‌కు గ్యాస్ సరపరా అవుతోంది.

# నేరాలు ఘోరాలు

## గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మామిడికుదురు

ఆటో ఢీకొని గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి పరిస్థితి విషమించి మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ కెవివిఎస్‌వి.ప్రసాద్ తెలిపారు. రాజోలు మండలం కడలిలోని వాసంశెట్టివారిపాలెనికి చెందిన మాదాసి శివకృష్ణ (35) గత నెల 28న బైక్ పై వెళ్తు చుండగా గెద్దాడ వద్ద ఒక ఆటో ఢీకొంది. తీవ్రంగా గాయపడిన శివకృష్ణ కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. ఆయన తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఇద్దరు సారా విక్రేతల అరెస్ట్

ప్రజాశక్తి - ఆలమూరు

మండపేట మండలంలో నిర్వహించిన దాడుల్లో 75 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సిఐ బిఐ నాగేశ్వరరావు తెలిపారు. మండపేట మండలం కేశవరానికి చెందిన కడగాలి రాంబాబు, ఏడిద సావరానికి చెందిన బండ్రేగుల సూరిబాబును అరెస్టు చేసినట్లు సిఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## సిగరెట్ కోసం హత్య..?

ప్రజాశక్తి - మండపేట

ఓ సిగరెట్ ఏకంగా ఓ వ్యక్తి ప్రాణం పోవడానికి కారణమైంది. సిగరెట్ కారణంగా ఇద్దరి మధ్య తలెత్తిన చిరు వివాదం చివరకు హత్య కేసుగా మారింది. ఈ ఘటన మండపేట 7వ వార్డు డాక్టర్ బిఆర్ అంబేద్కర్, జగజ్జీవన్‌రామ్ స్మారక మందిరం వద్ద చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు. మండపేటకు చెందిన సిందురపు వీరబాబు భవన నిర్మాణ కార్మికునిగా పనిచేస్తున్నాడు. వివాదాల నేపథ్యంలో భార్య పిల్లలకు కొంతకాలంగా దూరంగా ఉంటున్నాడు. పనిచేసుకుని 7వ వార్డులోని అంబేద్కర్ స్మారక మందిరం వద్ద పడుకుంటున్నాడు. ఎప్పటిలాగే ఆదివారం పనిచేసి అర్ధరాత్రి స్మారక మందిరం వద్దకు వచ్చి పడుకున్నాడు. నిద్రిస్తుండగా వేమగిరి సురేష్ మద్యం మత్తులో అతని వద్దకు వచ్చాడు. వీరబాబును లేపి సిగరెట్ ఇవ్వాలని అడిగాడు. ఇవ్వక పోవడంతో అరుగుపై పడుకున్న వీరబాబును కిందికి లాగేశాడు. దీంతో వీరబాబు తలకు తీవ్రగాయమైంది. స్థానికులు గమనించి వీరబాబును మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వీరబాబు(36) సోమవారం తెల్లవారు జామున మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మండపేట టౌన్ ఎస్ఐ హరికోటి శాస్త్రి కేసు నమోదు చేశారు. డిఎస్‌పి ఆధ్వర్యంలో సిఐ పి.దొరరాజు దర్యాప్తు చేస్తున్నారు. దర్యాప్తు అనంతరం వివరాలు వెల్లడిస్తామని సిఐ తెలిపారు.

**నిందితుని ఇంటికి వెళ్లిన పోలీసు జాగిలం**

కేసు దర్యాప్తులో భాగంగా క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ బందాలు ఘటనా స్థలికి చేరుకుని ఆధారాలు సేకరించాయి. పోలీస్ జాగిలంతో ఘటనా స్థలికి చేరుకోగా అది నేరుగా అక్కడి నుంచి పోలీసు స్టేషన్ పక్కనే వున్న సురేష్ ఇంటికి వెళ్లింది.

మండపేట 02 మృతుడు వీరబాబు... ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న క్లూస్ టీం

## చెరువులో పడి వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన ధర్మయ్య(80) రాజానగరం మండలం తూర్పు గోనగూడెం ఊర చెరువులో పడి మృతి చెందారు. జీవితంపై విరక్తి చెందిన ధర్మయ్య ఆదివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చారు. ఆతని కోసం గాలించినా కన్పించకపోవడంతో కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శివనాగ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సోమవారం ఆ వృద్ధుడు తూర్పు గోనగూడెం ఊర చెరువులో మృతి చెందివున్నట్లు పోలీసులు గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## ఆత్మహత్య కేసులో నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ఇటీవల దుర్గాడ రైల్వే ట్రాక్ సమీపంలో ఆత్మహత్యకు పాల్పడిన తోగరు దివ్య కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ పి.రామకృష్ణ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పిల్లలు పుట్టలేదని, అదనపు కట్నం కావాలని వేధింపులకు గురి చేయడంతో ఆమె ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తల్లి వరుపుల సీతామహాలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసినట్లు తెలిపారు. ఈ కేసులో భర్త తోగరు రమేష్, అత్త మామలు గొల్ల అబ్బాయి, సత్యవతి, కూతురు గుర్రం వినీలను అరెస్టు చేసినట్లు తెలిపారు.



బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న అధికారులు

## 800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని జె.తిమ్మాపురం గ్రామంలో సోమవారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవిబి.అప్పన్నబాబు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ పి.బిట్టిబాబు పాల్గొన్నారు.

## వీరేశ్వర స్వామికి రూ.50.43 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - ఐ.పోలవరం

మురమళ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని మురమళ్ల శ్రీ వీరేశ్వరస్వామి ఆలయానికి ఈ ఏడాది కార్తీక మాసంలో గణనీయంగా ఆదాయం పెరిగిందని ఆలయ కార్యనిర్వాహణ అధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గత రెండేళ్ల కంటే ఈ ఏడాది ఆలయ ఆదాయం రూ.6,48,816 పెరిగిందన్నారు. ఆలయానికి వివిధ సేవల ద్వారా రూ.50,43,680 ఆదాయం వచ్చిందన్నారు.

## నిత్యాన్నదాన ట్రస్ట్‌కు దాతల విరాళాలు

ప్రజాశక్తి -మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ శాశ్వత నిత్యాన్నదాన ప్రసాద ట్రస్ట్‌కు సోమవారం పలువురు దాతలు విరాళాలు అందించారని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు తెలిపారు. అమలాపురం వాసులు పోతుల దుర్గా ప్రసాదరావు సత్య వెంకట రమణి దంపతులు రూ.20 వేలు, కృష్ణా జిల్లా కంకిపాడు వాసులు విట్టంశెట్టి వెంకట నాగ సత్యనారాయణ వెంకట సునీత దంపతులు రూ.10,116 అందించారని తెలిపారు.

## ఎంఎస్ఎంఇ సర్వేను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - అల్లవరం

సచివాలయ సిబ్బంది మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజస్ సర్వే యాప్ ద్వారా త్వరగా ఎంఎస్ఎంఇ సర్వేను పూర్తి చేయాలని ఎంపిడిఒ బి.కృష్ణ మోహన్ సిబ్బందిని ఆదేశించారు. ఎంఎస్ఎంఇ సర్వే పురోగతిపై సోమవారం ఆయన సచివాలయ సిబ్బందితో కలిసి సమీక్షించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్స్ శిక్షణ పొందినందున వారు ఇతర సిబ్బందికి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజ్‌మోహన్, సచివాలయం సిబ్బంది రోజా, అర్జున్, లోవరాజు, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

## భీమేశ్వరుని దర్శించుకున్న సిఎంఒ కార్యదర్శి

ప్రజాశక్తి-రామచంద్రపురం



భీమేశ్వరాలయంలో కార్యదర్శి ప్రద్యుమ్న

ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి ప్రద్యుమ్న సోమవారం ద్రాక్షారామ భీమేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి, రామచంద్రపురం ఆర్‌డిఒ దేవరకొండ అఖిల ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



పోటీల్లో గెలుపొందిన గురుకులం విద్యార్థులు

## క్రీడల్లో గురుకులం విద్యార్థుల విజయకేతనం

ప్రజాశక్తి-అల్లవరం

గోడిలోని అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో విజయకేతనం ఎగురవేశారు. ఏలూరులో గత నెల నిర్వహించిన పోటీల్లో గోడి గురుకులానికి చెందిన సిహెచ్.క్రాంతి కిరణ్ జావలిన్ త్రోలో ద్వితీయ స్థానం, ఎస్.సతీష్ కుమార్ జావలిన్ త్రోలో ద్వితీయ స్థానం, డిస్కస్‌త్రోలో తృతీయ స్థానం సాధించారు. విజేతలను కళాశాల ప్రిన్సిపల్ నక్కా శ్రీనివాస్, పీడీ వి.నానిబాబు, పిఇటి వై.సుబ్రహ్మణ్యం, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బి.భరత్ కుమార్, వైస్ చైర్మన్ యాళ్ల నాగలక్ష్మి, సర్పంచ్ తోట శ్రీదేవి, నరసింహ దంపతులు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ సత్య బాబు రాజు, ఎంపిటిసి కాంద్రేగుల అచ్యుత సత్యనారాయణ, జిల్లా సమన్వయ అధికారి టి.ఉమాదేవి, జాయింట్ సెక్రెటరీ ఎ.మురళీకృష్ణ అభినందించారు.




సత్యనారాయణను సత్కరిస్తున్న సాహితీవేత్తలు, ప్రముఖులు

## కవి సత్యనారాయణకు ఘన సత్కారం

ప్రజాశక్తి-అమలాపురం

విజయవాడలో ఆదివారం నిర్వహించిన శతాధిక కవి సమ్మేళనంలో నిర్వహణ బాధ్యతలతో పాటు, కవితాగానం చేసిన అమలాపురానికి చెందిన ప్రముఖ కవి, రచయిత కవిరత్న డాక్టర్ బివివి సత్యనారాయణను సోమ వారం ఘనంగా సత్కరించారు. డాక్టర్ పొట్లూరి హరికృష్ణ జానపద అకాడమీ సారథ్యంలో విజయవాడ కోర్టు కాంప్లెక్స్‌లోని బుక్ ఫెస్టివల్ సొసైటీలో ఆదివారం రాత్రి వరకూ జరిగిన ఆంధ్ర తెలంగాణ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవులందరిచేత కవితాగానం చేయించి, నిర్వహణ బాధ్యతలు చక్కగా అమలు చేసినందుకు కవులు, ఫౌండేషన్ కార్యవర్గం మన్ననలను సత్యనారాయణ చూరగొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంఘసేవకులు గోర్ల నాగేశ్వరరావు , యాళ్ళ ఉమామహేశ్వరి, నందివాడ చిన్నాదేవి, బోనం గణేష్, రంగిశెట్టి రమేష్, ప్రముఖ కవి నల్లా నరసింహమూర్తి, రుద్రరాజు నానిరాజు, పోలిశెట్టి అనంతలక్ష్మి, పసలపూడి సతీష్, యెండూరి సీతామహాలక్ష్మి, యెండూరి రాఘవ పాల్గొన్నారు.

## రెండు రోజుల్లో ఆక్రమణలు తొలగించాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని గోవలంక పంచాయతీ స్థలంలో ఆక్రమణలను రెండు రోజుల్లో తొలగించాలని ఇన్‌ఛార్జ్ ఇఒపిఆర్‌డి నున్న శంకర నారాయణ ఆధ్వర్యంలో అధికారులు బృందం సోమవారం నివాసితులకు స్పష్టం చేశారు. అయితే తాము 50 ఏళ్లుగా ఇదే స్థలంలో నివసిస్తున్నామని, గతంలో ఉన్న పూరిపాకను తొలగించి పక్కా ఇంటిని నిర్మించుకుంటున్నామని, ఆయా నిర్మాణాలను అడ్డుకోవద్దని, దీనికి సంబంధించి కోర్టు ఉత్తర్వులు ఉన్నాయని కొట్నాల దేవానందం, కొట్నాల మధు తెలిపారు. ఈ స్థలాల్లోనే నివాసం ఉండటంతో ప్రభుత్వాలు ఇస్తున్న పేదలకు ఇచ్చే ఉచిత స్థలాలు మాకు ఇవ్వడం లేదన్నారు. ఈ స్థలంలోనే ఇల్లు నిర్మించుకునేలా కలెక్టర్, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు అనుమతులు ఇవ్వాలని కోరారు. దీనిపై ఇఒపిఆర్‌డి నున్న శంకరనారాయణ, పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్ మాట్లాడుతూ గోవలంక పంచాయతీకి చెందిన సర్వేనెంబర్ 52/4 లోని 16 సెంట్లు కామన్ స్థలంలో పలు ఆక్రమణలు జరిగాయని, అయితే ఇటీవల నిర్మాణం ప్రారంభించిన భవనాన్ని తొలగించాలని కలెక్టర్ ఆదేశాలను అమలు చేస్తున్నామని అన్నారు. నిర్మాణదారులు కోరిక మేరకు రెండు రోజుల సమయం ఇచ్చామని అన్నారు.

# వర్షంతో రహదారి ధ్వంసం

ప్రజాశక్తి - అంబాజీపేట



బురదమయంగా మారిన రహదారి

గ్రామీణ ప్రాంతాలలో వివిధ శాఖల సమన్వయ లోపంతో ఒక అభివృద్ధి పని చేసేటప్పుడు మరో అభివృద్ధి పని ధ్వంసమై ప్రజాధనం దుర్వినియోగం అవుతోంది. చిరతపూడి ఆర్ అండ్ బి రహదారి నుండి కట్టావారిపాలెం వెళ్లే రోడ్డు 2021లో రూ.65 లక్షల వ్యయంతో 800 మీటర్ల మేర గ్రావెల్ రోడ్డు వేశారు. ఈ రోడ్డు మార్జిన వెంబడి పిఆర్ డబ్ల్యుఎస్ పైపులైన్ నిర్మాణ పనుల్లో భాగంగా రోడ్డు మూసుకుపోయేలా మట్టి వేయడంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రోడ్డు బురదమయం అయ్యింది. వాహనదారులు, స్థానికులు అవస్థలు పడుతున్నారు. అంతేకాక రోడ్డు కూడా ధ్వంసం అవడంతో ఈ రహదారి మీదుగా పుల్లేటికుర్రు, అవిడి, మోడేకుర్రు గ్రామాలకు దగ్గర మార్గం కావడంతో ఆయా ప్రాంతాల వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇబ్బందులు తొలగించి ఈ రహదారి అభివృద్ధి పరచాలని స్థానికులు కోరుచున్నారు.

# వాకింగ్ ట్రాక్ పునర్నిర్మాణానికి చర్యలు

ప్రజాశక్తి-ముమ్మిడివరం



వాకింగ్ ట్రాక్‌ను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ సుబ్బరాజు

పట్టణ ప్రజలకు ఉపయుక్తంగా ఉండే విధంగా వాకింగ్ ట్రాక్ పునర్నిర్మాణానికి చర్యలు చేపట్టనున్నట్లు స్థానిక శాసన సభ్యుడు దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక పోలమ్మ చెరువు మంచినీటి ట్యాంక్ చుట్టూ ఉన్న వాకింగ్ ట్రాక్‌ను నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్, టిడిపి నాయకులతో కలిసి ఎంఎల్ఎ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నగర వాసుల ఆరోగ్య పరిరక్షణకు వాకింగ్ ట్రాక్‌ను పునర్నిర్మాణం చేయడమే కాకుండా, వాకింగ్ ట్రాక్ చుట్టూ దేశ నాయకుల విగ్రహాలను ఏర్పాటు చేసి సుందరమైన ప్రదేశంగా తీర్చిదిద్దాలని ఆయన సూచించారు. అంతే కాక వ్యాయామానికి అవసరమయ్యే జిమ్ సామాగ్రిని వాకింగ్ ట్రాక్ వద్ద ఏర్పాటు చేయాలని కమిషనర్‌ను ఆదేశించారు. ఆయన వెంట టిడిపి నాయకులు గొలకోటి దొరబాబు, వీళ్ల వీరాస్వామి నాయుడు, చిక్కాల అంజిబాబు, గొల్లపల్లి గోపితో పాటు కమిషనర్ పి.రవి వర్మ, ఎఇ పివి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# బోడసకుర్రులో దళితుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - అల్లవరం



సమ్మేళనంలో మాట్లాడుతున్న అశోక్ కుమార్

బోడసకుర్రు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బోడసకుర్రు కమసాల మామిడి సెంటర్‌లో మాలల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు అధ్యక్షులు పండు అశోక్ కుమార్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరూ ఉన్నతమైన విద్యను అభ్యసించి అంబేద్కర్ ఆలోచన విధానాలను ముందుకు తీసుకెళ్లిన నాడే హక్కులను సాధించుకోగలుగుతామని తెలిపారు. గ్రామ సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళ్ళా స్వేచ్ఛ, సమానత్వం హక్కులను సాధించుకోగలుగుతున్నామంటే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భారత రాజ్యాంగమే కారణం అన్నారు. ఈ కార్యక్రమంలో మోసుగంటి దుర్గారావు, మాజీ సర్పంచ్ సాపే ధర్మరాజు, జల్లి శ్రీనివాసరావు, అంబటి శ్రీను, రొక్కాల నాగేశ్వరరావు, ఎలకతోరి గోపాలం, ముత్తాబత్తుల శ్రీమన్ రాజు, అంబటి లక్ష్మణరావు, నాగవరపు ఈశ్వరరావు, పులిదిండి వెంకన్నబాబు, తిరుకోటి బాలాజీ, నాగాబత్తుల సురేష్, జల్లి రాధాకృష్ణ, విప్పర్తి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి పోటీలకు లక్ష్మీప్రసన్న

ప్రజాశక్తి - అంబాజీపేట



విద్యార్థిని అభినందిస్తున్న సర్పంచ్, హెచ్‌ఎం తదితరులు

కేరళలో జరిగే జాతీయ స్థాయి సెపక్‌తాక్రా పోటీలకు ఇసుకపూడి హైస్కూల్ విద్యార్థిని కన్నేటి పూర్ణ లక్ష్మీ ప్రసన్న ఎంపికైనట్టు హెచ్‌ఎం ఎఎల్.వరప్రసాద్, పీడీ బూల చిరంజీవి తెలిపారు. జాతీయ పోటీల్లో ప్రతిభ చూపించాలని సర్పంచ్ తరపట్ల మోహన్ సింగ్ బాబూరావు ఆకాంక్షించారు. నంద్యాల జిల్లా నందికొట్కూర్‌లో గత నెల 26, 27 తేదీల్లో జరిగిన పోటీలలో సబ్ జూనియర్ విభాగంలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైందన్నారు. విద్యార్థిని ప్రయాణ ఖర్చులకు సర్పంచ్ రెండు వేలు, ఎంపిటిసి ముత్తాబత్తుల ప్రశాంత్ రూ.వెయ్యి, పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు రూ.రెండు వేలు ప్రోత్సాహక నగదు బహుమతి అందజేశారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పల్లి స్వామి నాయుడు, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు విద్యార్థిని అభినందించారు.

# ముగిసిన పాస్టర్స్ ఐక్య క్రిస్మస్ సభలు

ప్రజాశక్తి - సామర్లకోట

మండల పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న 33వ వార్షిక మహాసభలు ఘనంగా ముగిశాయి. అసోసియేషన్ అధ్యక్షులు రెవ డాక్టర్ ఎం.సాల్మన్ రాజు అధ్యక్షతన జరిగిన క్రిస్మస్ వేడుకలో మాత్యూస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథుల చేతుల మీడిగా క్యాండిల్ సర్వీస్ నిర్వహించి, ప్రత్యేక కేకును కోసి ఐక్య క్రిస్మస్ వేడుకలను ప్రజలతో కలిసి నిర్వహించారు. మండల పాస్టర్స్ అసోసియేషన్ నూతన కార్యావర్గాన్ని ఈ సందర్భంగా ప్రకటించి పరిచయం చేశారు. నూతన అధ్యక్షులుగా రెవ. టి.బ్లెస్సింగ్, కార్యదర్శిగా రెవ. కె.జయబాబు, కోశాధికారిగా రెవ. వై.కరుణకుమార్, ఉపాధ్యక్షులుగా రెవ. పి.తిమోతి, సహాయ కార్యదర్శులుగా రెవ. వి.డేవిడ్‌రాజు, రెవ. పి.విజయబాబు, పాస్టర్ ఎస్ సైలాస్, పాస్టర్ వై.రాము మోసెస్, సహాయ .కోశాధికారిగా రెవ. ఎన్.బెంజిమెన్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు అధ్యక్షులు ఆక్టర్ సాల్మన్ రాజు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు వంకా జాన్, రొట్టా లాజరస్, ఎ.చంటి, ఆనంద్ జోసెఫ్, జి.విశ్వేశ్వరరావు, ఎన్.రాజు పాల్గొన్నారు.

# నిత్యం ప్రజలతోనే ఉంటాం: ముద్రగడ

**ప్రత్తిపాడు** : నిత్యం ప్రజలతోనే ఉంటామని వైసిపి నాయకుడు ముద్రగడ పద్మనాభం అన్నారు. సోమవారం మండలంలో రాచపల్లి గ్రామంలో గంగాలమ్మ తల్లిని ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసి సామాజికవర్గంతో తనకు ఎంతో అనుబంధం ఉందన్నారు. ఆ సామాజికవర్గం తన కుటుంబాన్ని ఎల్లప్పుడూ గుర్తు పెట్టుకునే ఉంటుందన్నారు. జగన్ పాలనలో అన్ని సంక్షేమ పథకాలు లబ్ధిదారుని ఇంటికే వచ్చేవని, అందుకు వాలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారని అన్నారు. కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాక హామీలు అమలు చేయడంల లేదన్నారు.

# అధ్వానంగా కపిలేశ్వరపురం రహదారి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం



గుంతల్లో నీటితో దర్శనమిస్తున్న రహదారి

కపిలేశ్వరపురం ఆర్ అండ్ బి రహదారి గోతులు మయంగా వర్షం నీరుతో అధ్వానంగా మారింది. ఈ రహదారిపై వాహనదారులు, ప్రయాణికులు, నరకయాతన పడుతున్నారు. కపిలేశ్వరపురం నుంచి పలు ప్రాంతాలకు వెళ్లాలంటే ఈ రహదారి మీదుగానే వెళ్లాలి. అధ్వాన స్థితిలో ఉన్న రహదారికి మరమ్మతు పనులు చేపట్టే నాథుడే కరువయ్యారు. వర్షాలు కురిసే సందర్భాల్లో గోతుల్లోకి నీరు చేరడంతో రహదారి కనపడక వాహనదారులు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు, రహదారి మీదుగా భారీ వాహనాలు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే అధికారులు, అనేక అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయాల్లో రహదారిపై వెళ్లాలంటే ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ రహదారి సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా నేటికీ రహదారి సమస్య పరిష్కారం కాలేదని వాపోతున్నారు.



## రామచంద్రపురం తహశీల్దార్‌గా సావిత్రి

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం తహశీల్దారుగా ఎం.సావిత్రి నియమితులయ్యారు. ఆమె రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయం నుండి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ తహశీల్దారుగా పని చేసిన ఎం.వెంకటేశ్వరరావు సఖినేటిపల్లి బదిలీపై వెళ్లారు. ఈ మేరకు కోనసీమ కలెక్టర్ కార్యాలయం నుండి ఉత్తర్వులు వెలువడ్డాయి. విధుల్లో చేరిన సావిత్రి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆమెకు అభినందనలు తెలిపారు.



గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు

## కుక్కల స్వైర విహారంతో భయాందోళన

ప్రజాశక్తి-రామచంద్రపురం

పట్టణంలో వీధి కుక్కలు స్వైర విహారం చేయడంతో ప్రజలు భయాందోళన గురవుతున్నారు. ముఖ్యంగా పట్టణంలో 25వ వార్డు 27వ వార్డులో కుక్కల స్వైర విహారం ఇటీవల మరీ అధికమైంది. కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ పాదచారులపైన, కొత్తగా కనిపించిన వారిపైనా దాడి చేస్తున్నాయి. దీంతో ఈ వార్డులో సంచరించాలంటే ప్రజలకు, విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. చిన్నారులు స్కూలుకు వెళ్లేందుకు ఈ కుక్కలను తప్పించుకుని వెళ్లేందుకు సాహసమే అవుతోంది. దీనిపై అధికారులు స్పందించి వీధి కుక్కలను అరికట్టాలని ఆయా వార్డు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## శాయ్ స్పోర్ట్స్ రీజినల్ డైరెక్టర్ పర్యటన

ప్రజాశక్తి - యానాం

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) రీజనల్ డైరెక్టర్ కిషోర్ సోమవారం యానాంలో పర్యటించారు. స్థానిక జిఎంసి బాలాజీ క్రీడా ప్రాంగణంలో ఉన్న స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా బ్రాంచ్ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయంలో ఆర్ఎఒ మునిస్వామి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన సాయి స్పోర్ట్స్ యానాంలో రావడానికి గల కారణాలు, ఏర్పాటు చేసిన, చేయాల్సిన సౌకర్యాలు, ప్రభుత్వపరంగా చేసిన సదుపాయాలు తదితర అంశాలపై వివరించారు. అదేవిధంగా యానాంలో మరిన్ని క్రీడా విభాగాలు కేటాయించాలని డైరెక్టర్ కిషోర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సాయి స్పోర్ట్స్ ఇన్‌ఛార్జ్ ఉదయ్ పాల్గొన్నారు.

## పోర్టులో అక్రమాలపై విచారణ చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ పోర్ట్‌లో జరుగుతున్న అక్రమాలపై సిబిఐ విచారణ చేయాలని సిపిఐ రాష్ట్ర నాయకుడు టి.మధు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాకినాడ పోర్టుకు ఎంతో చరిత్ర ఉందని, పోర్టును నమ్ముకుని సుమారు 30 వేల కార్మిక కుటుంబాలు జీవిస్తున్నాయని అన్నారు. వైసిపి పాలనలో పిడిస్ బియ్యం ఆఫ్రికా దేశాలకు తరలి వెళ్లాయని, మాజీ ప్రజాప్రతినిధి చేతుల్లో ఇవన్నీ సాగాయని డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు వాస్తవం అయితే తక్షణమే సిబిఐ విచారణ చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. పిడిఎస్ బియ్యం ఎగుమతులను నివారించేందుకు అవసరమైన సిబ్బందిని నియమించి అడ్డుకట్ట వేయాలని అన్నారు. పోర్టు ఎంట్రన్స్‌లో చెక్ పోస్టులు పెట్టడం వల్ల లోడింగ్‌కు అధిక సమయం పడుతుందని, దీంతో కార్మికులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు.

## పలువురికి జ్యోతుల నవీన్ పరామర్శ

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని యర్రంపాలెం గ్రామంలో పలు కుటుంబాలను టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ సోమవారం పరామర్శించారు. తొలుత కిడ్నీలో రాళ్లకు సంబంధించి ఆపరేషన్ చేయించుకున్న ఉపసర్పంచ్ ముత్యాల దుర్గారావును పరామర్శించారు. అలాగే మాతృవియోగంతో బాధపడుతున్న మాజీ సర్పంచ్ ముత్యాల వీరభద్రరావును, గున్నం శ్రీనివాస్ మృతితో బాధపడుతున్న ఆయన కుటుంబాన్ని, మాతృవియోగంతో బాధపడుతున్న పంచాయతీ వార్డు సభ్యులు ముత్యాల వీర వెంకట సత్యనారాయణను, మృతి చెందిన చింతపల్లి బాబురావు కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో మండల టిడిపి అధ్యక్షులు పోతుల మోహనరావు, నియోజవర్గం తెలుగు యువత అధ్యక్షులు దేవరపల్లి మూర్తి, ముత్యాల భాస్కరరావు, ముత్యాల వీరభద్రరావు, బిక్కిన వెంకట్రావు, పెదపాటి శుభకార్, ముత్యాల సతీష్, ముత్యాల భద్రరావు పాల్గొన్నారు.

## పేరెంట్స్ డేను ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - సామర్లకోట

ఈ నెల 7వ తేదీన నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్ డేను పండగ వాతావరణంలో నిర్వహించాలని ఎంఇఒ-1 వై.శివరామకృష్ణయ్య తెలిపారు. సోమవారం ఆయన స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌ను సందర్శించి పేరెంట్స్ డే ఏర్పాట్లను హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ, ఎస్ఎంసి ఛైర్మన్ అక్కిన చక్రధర్ సమీక్షించారు. హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు పేరెంట్స్‌కు అంద చేయడానికి సిద్ధం చేసినట్లు హెచ్‌ఎం తోటకూర సాయి రామకృష్ణ వివరించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని స్వయంగా వడ్డించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి స్కూల్‌లోను పేరెంట్స్ అందరూ హాజరయ్యేలా దృష్టి సారించాలన్నారు. డిసెంబర్ 4న 3, 6, 9 తరగతులకి నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (నాస్ )పరీక్షను ఎంపిక చేసిన ఆరు స్కూల్స్‌లో పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి సభ్యులు పి.సతీష్, ఎం.దేవి, లక్ష్మి, టి.రాఘవ, కె.అరుణ పాల్గొన్నారు.